
దశ
నిజం.. నిర్భయంగా..

02
ఆదివారం
7-12-2025
WWW.
DASHANEWS
.COM



భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని పెద్ద అంబర్పేట్, కుంట్లూర్ పరిధిలో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి పెద్ద అంబర్పేట్ మాజీ మున్సిపల్ చైర్మన్ ఈదమ్మల బలరాం ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గ్యారల శ్రీనివాస్ గౌడ్, డీవీఎం రాములు,మాడుగుల వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. -(దశ, పెద్ద అంబర్ పేట్ )

# 4 రోజుల్లో 1,700 విమానాలు రద్దు

❖ రంగంలోకి దిగిన విమానయానశాఖ

❖ దిద్దుబాటు చర్యలు షురూ




**దశ, న్యూఢిల్లీ:** భారతదేశంలోనే అతిపెద్ద విమానయాన సంస్థ అయిన ఇండిగో, ప్రతి నెలా కోటి మందికి పైగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తుంది. అయితే, గత 1012 రోజులుగా ఇది తన అత్యంత దారుణమైన పరిస్థితిని ఎదుర్కొంటోంది. డిసెంబర్ ప్రారంభంలో, ప్రతిరోజూ 400600 విమానాలు ఒక్కసారిగా రద్దయ్యాయి. ఢిల్లీ, ముంబై, బెంగళూరు, హైదరాబాద్ , ఇండోర్ వంటి ప్రధాన విమానాశ్రయాల్లో గందరగోళం నెలకొంది. ప్రజలు గంటల తరబడి క్యూలలో నిలబడ్డారు, టికెట్ ధరలు రెట్టింపు లేదా మూడు రెట్లు పెరిగాయి. సోషల్ మీడియాలో ఆగ్రహం వ్యక్తమైంది. ఇండిగోకు అసలు ఏమైంది? అని అందరి మదిలో ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### 4 రోజుల్లో 1700 విమానాలు రద్దు.

DGCA సమావేశంలో, ఇండిగో పైలట్ల అసలు అవసరం గురించి తప్పుగా అంచనా వేసినట్లు అంగీకరించింది. కొత్త నిబంధనలు అమలులోకి వచ్చిన తర్వాత సిబ్బంది లభ్యత తగ్గుతుందని అర్థం చేసుకోవడంలో పొరపాటు జరిగింది. రోస్టర్ తయారు చేయడంలో ఆలస్యం, లోపం జరిగింది. ఫేజ్ 2 కోసం సన్నాహాలు అసంపూర్తిగా ఉన్నాయి. కొత్త నిబంధనలు వచ్చిన తర్వాత ఇండిగో పైలట్‌లు, ఇతర సిబ్బంది కొరతను తీర్చలేకపోయింది. గత 4 రోజుల్లో ఇండిగో 1700 కంటే ఎక్కువ విమానాలను రద్దు చేసింది.ఢిల్లీలో అత్యధికంగా 225 విమానాలు రద్దు అయ్యాయి. పూణేలో 32 విమానాలు రద్దు. హైదరాబాద్ విమానాశ్రయంలో 3 రోజుల్లో 197 విమానాలు రద్దు కాగా బెంగళూరులో 102 విమానాలు రద్దు అయ్యాయి.ఇండిగో మొత్తం వ్యాపార నమూనా ఎక్కువ విమానాలు, తక్కువ ధర , వేగవంతమైన టర్న్అవుట్‌పై ఆధారపడి ఉంటుంది. దీనిలో 70% కంటే ఎక్కువ విమానాలు రాత్రి లేదా అర్ధరాత్రి వరకు నడుస్తాయి. చిన్న చిన్న మార్గాల్లో పదేపదే విమానాలు నడుపుతారు. కొత్త నిబంధనలు వచ్చినప్పుడు పైలట్‌లు ఒక్కసారిగా తగ్గిపోయారు. అతి పెద్ద తప్పు ఏమిటంటే, ఇండిగో 1820 నెలల సమయం లభించినప్పటికీ, కొత్త నిబంధనల ప్రకారం పైలట్‌లను పెంచలేదు. మిగిలిన ఎయిర్ ఇండియా, విస్తారా, ఆకాశా ఎయిర్ వంటి ఎయిర్‌లైన్స్ ఇప్పటికే పైలట్‌లను నియమించుకున్నాయి. ఇండిగో ఈ మార్పును నిర్వహించలేకపోయింది.ఫలితంగా, నవంబర్ చివరి వారం నుంచి డిసెంబర్ మొదటి వారం వరకు ప్రతిరోజూ వందలాది విమానాలు రద్దు అయ్యాయి. వేల మంది ప్రయాణికులు 24 గంటల పాటు ఆకలితో, దాహంతో విమానాశ్రయంలో చిక్కుకుపోయారు. విమాన టికెట్ ధరలు ఆకాశాన్ని తాకాయి. స్టాక్ మార్కెట్‌లో కంపెనీ షేర్లు 1012% వరకు పడిపోయాయి.

### ప్రభుత్వం మధ్య మార్గ పరిష్కారం .

ప్రయాణీకుల తీవ్ర ఇబ్బందులు , మొత్తం విమానయాన వ్యవస్థ కూలిపోతుందనే భయంతో DGCA వెనక్కి తగ్గింది. డిసెంబర్ 5, 2025న, తక్షణ ఉపశమనం కలిగిస్తూ, ఇప్పుడు విమానం రాత్రి 12 గంటల తర్వాత కొంచెం నడిస్తే, దానిని పూర్తి నైట్ డ్యూటీగా పరిగణించబోరని ప్రకటించింది. అంటే, పైలట్ మరుసటి రోజు ఉదయం విమానాన్ని సులభంగా నడపగలడు. వీక్లీ రెస్ట్‌కు బదులుగా సెలవు ఇవ్వకూడదనే నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది. పౌర విమానయాన శాఖ మంత్రి అన్ని ఎయిర్‌లైన్స్ కంపెనీలకు విమానాలు రద్దు అయితే పూర్తి రీఫండ్ ఇవ్వాలని ఆదేశించారు. అలాగే చిక్కుకుపోయిన వారికి హోటల్‌లో వసతి కల్పించాలని కోరారు.

# హైదరాబాద్ లో ఆపరేషన్ కవచ్

**దశ, హైదరాబాద్:** తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో ఆదివారం నగరంలో శాంతిభద్రతలను మరింత బలోపేతం చేయడానికి, నేరస్థులను అరికట్టడానికి హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ శనివారం రాత్రి 10:30 గంటల నుండి 'ఆపరేషన్ కవచ్'పేరుతో ఒక భారీ తనిఖీ కార్యక్రమాన్ని ప్రారంభించింది.ఈ కార్యక్రమం హైదరాబాద్ పోలీసుల చరిత్రలో ఒక ప్రత్యేకమైనది, ఇందులో ఒకేసారి 5,000 మందికి పైగా పోలీసులను మోహరించారు, వీరు నగరంలోని 150 ముఖ్యమైన ప్రదేశాలలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.



ఈ భారీ తనిఖీ కార్యక్రమానికి స్వయంగా హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సి.వి. సజ్జనార్ నాయకత్వం వహించారు. ఇందులో లా & ఆర్డర్, ట్రాఫిక్, టాస్క్ ఫోర్స్‌తోపాటు సాయుధ రిజర్వ్, బ్లూ కోల్ట్స్, పెట్రోలింగ్ బృందాలు కూడా పాల్గొన్నాయి. ఇది సమన్వయంతో కూడిన ప్రయత్నం, దీని లక్ష్యం నగరంలోని ప్రతి మూలలో భద్రతా వాతావరణాన్ని సృష్టించడం, అనుమానాస్పద కార్యకలాపాలను అరికట్టడం.ఈ కార్యక్రమం కింద, ప్రధాన కూడళ్లు, హోటళ్లు, లాడ్జీలు, బస్ స్టాప్‌లు, రైల్వే స్టేషన్లలో విస్తృతమైన తనిఖీలు చేశారు. పోలీసు బృందాలు ద్విచక్ర, ఫోర్ వీలర్స్ వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశాయి., అనుమానితులను ప్రశ్నించారు. వారి పత్రాలను పరిశీలించారు.

నేర చరిత్ర కలిగిన వ్యక్తులు లేదా తప్పుడు పత్రాలతో తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నించేవారిపై ప్రత్యేక దృష్టి సారించారు. భద్రతా కార్యక్రమంలో పోలీసులకు పూర్తి సహకారం అందించాలని పోలీస్ కమిషనర్ సి.వి. సజ్జనార్ నగరవాసులను కోరారు. "ఈ కార్యక్రమం మీ భద్రత కోసం. మీకు ఏదైనా అనుమానాస్పద కార్యకలాపం లేదా వ్యక్తి కనిపిస్తే వెంటనే 100కు డయల్ చేసి సమాచారం అందించండి" అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమం ద్వారా నగరంలో నేరాలకు తావుండదని, పౌరుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తామని పోలీసులు స్పష్టం చేశారు.

# బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు నాయకత్వంలో ఆదివారం ఇందిరాపార్కు వద్ద ధర్నా

**దశ ఓయూ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో విఫలమైన సందర్భంగా రేపు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు N. రాంచందర్ రావు ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా చౌక్ వద్ద నిర్వహించబోయే మహాధర్నాను విజయవంతం చేయాలని బిజెపి మేడ్చల్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ పిలుపునిచ్చారు. నాచారంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోపాల్ గౌడ్ మాట్లాడారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయిన ఇప్పటివరకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. అబద్దాలను



అచ్చు గుద్దినట్టు చూపించే పార్టీ ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు ఆరు గ్యారెంటీలు అని చెప్పి ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించాడని ఆరోపించారు. ప్రజలు రేవంత్ రెడ్డిని గుడ్డిగా నమ్మి ఓట్లేసారని ఇప్పుడు నెత్తి కొట్టుకుంటున్నారన్నారు. మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందా లేదా అని ఉన్నప్పుడే తెలంగాణను దోచుకోవాలన్నట్టు కాంగ్రెస్ నాయకులు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారన్నారు. ఆరు గ్యారెంటీలలో పూర్తిస్థాయిలో ఏ ఒక్క గ్యారంటీని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాచారం డివిజన్ అధ్యక్షుడు కుమ్మగల్లు నవీన్ కుమార్, సీనియర్ నాయకులు మల్కా ప్రకాష్,రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా

❖ మదనపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి మౌనిక ఆంజనేయులు

**దశ, రాజేంద్రనగర్:** గ్రామ అభివృద్ధి లక్ష్యంగా నిరంతరం పనిచేస్తానని మదన్ పల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి కృష్ణమోని మౌనిక ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. గ్రామ సర్పంచ్ ఎన్నికలలో భాగంగా శనివారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం మదన్ పల్లి గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ఉంగరం గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను సర్పంచ్ అభ్యర్థి కృష్ణమోని మౌనిక ఆంజనేయులు కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామ అన్ని అభివృద్ధి చేయడానికి తను అహర్నిశలు కృషి చేస్తానని ఒకసారి అవకాశం ఇచ్చి ఉంగరం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అన్నారు. గ్రామంలోని పెద్దలు మహిళలు యువకులు అంతా మద్దతు తనకు ఉందని భారీ మెజార్టీతో గెలవడం ఖాయం అన్నారు. గెలిచిన వెంటనే గ్రామంలో మొదట సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వీధి దీపాలు, ఇండ్లపై ఉన్న విద్యుత్ తీగలను తొలగించే కార్యక్రమాన్ని మొదలుపెడతామన్నారు. ప్రతి ఒక్కరూ ఆదరించి సర్పంచ్ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింలు, హనుమంతు, వెంకటేష్, శ్రీనివాస్, గోపాల్, రవి, రాజు సింగ్, మహేందర్ సింగ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్,బీఆర్ఎస్ పార్టీ మీద పడి ఏడ్వడం తప్ప చేసిందేముంది

❖ సీఎం రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగిన హరీశ్‌రావు

దశ, హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. కనకపు సింహాసనం మీద కూర్చోబెట్టినంత మాత్రాన శునకం తన బుద్ధి మార్చుకోదని.. అలాగే రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రి సీట్లో కూర్చోబెట్టినా వెనుకటి గుణం మార్చుకోడు, మార్చుకోలేడు అని విమర్శించారు. రెండేళ్లుగా కేసీఆర్ మీద, బీఆర్ఎస్ పార్టీ మీద పడి ఏడ్వడం తప్ప నువ్వు చేసిందేముంది రేవంత్ రెడ్డి అని నిలదీశారు.విజయోత్సవాలు అంటూ విచ్చలవిడిగా తిరుగుతూ, వికృతంగా మాట్లాడటం వల్ల చేయనివి చేసినట్లు అయిపోవని సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. అబద్ధాలు ప్రచారం చేసినంత మాత్రాన, వాస్తవాలు మరుగున పడిపోవని అన్నారు.

కేసీఆర్ అందించిన సంక్షేమ ఫలాలు ప్రజలు మరిచిపోరని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని పచ్చి అబద్ధం చెబుతున్న రేవంత్ రెడ్డి.. 6,47,479 రేషన్ కార్డులు మంజూరు చేసింది అబద్ధమా అని ప్రశ్నించారు. గతంలో కార్డు మీద నాలుగు కేజీల బియ్యం మాత్రమే ఇస్తే, బీఆర్ఎస్ ప్రభుత్వం దాన్ని ఆరు కేజీలకు పెంచి, కుటుంబంలో ఎంత మంది ఉంటే అంత మందికి ఇచ్చింది అబద్ధమా అని నిలదీశారు. నల్లగొండ



ప్రజల మీద కక్ష కట్టింది ఎవరు, ఎస్ ఎల్ బీ సీ ప్రాజెక్టును నెవర్ ఎండింగ్ ప్రాజెక్టుగా డిజైన్ చేసింది ఎవరు? ప్రాజెక్టును పడావు పెట్టింది ఎవరు? బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ. 3892 కోట్లు ఖర్చు చేసి, 11.48 కిలోమీటర్ల సొరంగం పనులు పూర్తి చేసింది నిజం కాదా? ఈ లెక్కలు మీ ప్రభుత్వం దగ్గర లేవా? పదే పదే ఎందుకు అబద్దాలు చెబుతున్నారు రేవంత్ రెడ్డి అని నిలదీశారు.అనాలోచిత నిర్ణయాలు, నిర్లక్ష్యం, దుందుడుకు చర్యలతో ఇవాళ ఎస్ ఎల్ బీ సీని త్రిశంకు స్వర్గంలో పడేసింది మీరు కాదా అని సీఎం రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు ప్రశ్నించారు.

# సురక్ష సేవా సంఘం ఆధ్వర్యంలో 47 మంది నిరుపేదలకు ఉచిత కంటి ఆపరేషన్లు



**దశ, అబ్దుల్లాపూర్ మెట్:** సురక్ష సేవా సంఘం ఆధ్వర్యంలో గత మూడు సంవత్సరాలుగా చూపు లేని వృద్ధులను చేరదీసి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేపించడం జరుగుతుందని, ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి 512 మంది వృద్ధులకు చూపునివ్వడం జరిగిందిని సురక్ష సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కిక్కర గోపిశంకర్ యాదవ్ అన్నారు. శరీరం లోని ఏ అవయవం పని చేసినా పని చేయకున్నా... కంటి చూపు కోల్పోతే లోకమంతా చీకటే..దీనికి తో పాటు ఒంటరి వృద్ధుల బాధలు ఊహించుకో లేమని, వీటిని దృష్టిలో ఉంచికొని వారికి ఆసరాగా నిలబడాలని సురక్ష సేవా సంఘం తెలంగాణ , శ్రీ ధన లక్ష్మి ఆప్టికల్స్ సికింద్రాబాద్ లోని పుష్పగిరి కంటి ఆసుపత్రి వారి సహకారం తో విజయ వంతంగా కంటి ఆపరేషన్లు చేపించి శనివారం క్షేమంగా వారి గృహాలకు తరలించడం జరిగిందన్నారు. నిరుపేదలకు అబ్దుల్లాపూర్ మెట్టు, పెద్దంబర్పేట పరిసర ప్రాంతాల కి చెందిన వృద్ధులు17 మంది ఇంకా వరంగల్, జనగాం, సంగారెడ్డి, వికారాబాద్, నల్గొండ జిల్లాలకు చెందిన 30 మంది వృద్ధులకు కంటి ఆపరేషన్లు జరిగిన వృద్ధులకు ఆసరాగా నిలబడటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ ధన లక్ష్మీ ఆప్టికల్స్ ఆప్టో మెట్రిస్ట్ రాజేష్ గౌడ్ ,సురక్ష సభ్యులు యాకుబ్ , సర్కారి నవాను, రఘు వీర్ పాల్గొన్నారు.

# ఎంఐఎం మెప్పు కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటుంది

❖ బడంగ్ పెట్ మున్సిపల్ కార్పొరేషన్ ను చార్మినార్ జోన్ లో విలీనం చేయకూడదు: చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

**దశ, బడంగ్పేట్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో ఉన్న 27 అర్బన్ మున్సిపాలిటీలను జిహెచ్ఎంసి లో విలీనం చేస్తూ వాటికి జోన్ లను కేటాయిస్తూ విడుదలైన జీవోలో భాగంగా బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ను సౌత్ జోన్ లో ఉన్నటువంటి చార్మినార్ జోన్ లో విలీనం చేయడాన్ని నిరసిస్తూ శనివారం కార్పొరేషన్ బిజెపి అధ్యక్షులు రాళ్ల గూడెం రామకృష్ణారెడ్డి రామిడి వీర కర్ణ రెడ్డి ఆధ్వర్యంలో బడంగ్ పేట్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట బడంగ్పేట్ కో బచావో కార్యక్రమంలో భాగంగా నిర్వహించినటువంటి మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు, బిజెపి పార్లమెంట్ విప్ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్, మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్ అందెల శ్రీరాములు హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్ రెడ్డి గారు మాట్లాడుతూ ఎంఐఎం పార్టీ



మెప్పు కోసమే కాంగ్రెస్ పార్టీ ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటుందని,మెజారిటీ ప్రజల అభిప్రాయానికి గౌరవించి వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్పొరేషన్ నాయకులు, వివిధ కాలనీ అధ్యక్షులు, వివిధ కుల సంఘాల నేతలు పెద్ద ఎత్తున పాల్గొని తమ మద్దతును తెలిపారు.

# దళిత జాతి ముద్దుబిడ్డ బి.ఆర్ అంబేద్కర్


❖ అంబేద్కర్ వర్ధంతి వేడుకల్లో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ రామ్మూర్తి యాదవ్



**దశ, సూర్యాపేట:** భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దళిత జాతి ముద్దుబిడ్డ అని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్ అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ 69 వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల లేసి నివాళులర్పించారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, దళిత జాతి ముద్దు బిడ్డగా, సమాజంలో అణచివేయబడిన వర్గాల కోసం పోరాడారని అన్నారు. సామాజిక న్యాయం, సమాన హక్కులు సాధించిపెట్టడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. ఆయన భారత రాజ్యాంగ నిర్మాతగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా, సంఘ సంస్కర్తగా, విద్యావేత్తగా దళిత, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసి, వారి ఆరాధ్య దైవంగా నిలిచారు అని అన్నారు. అంటరానితనాన్ని దూరం చేసిన వ్యక్తి అంబేద్కర్ అని అన్నారు. ఏ ఒక్కరి కోసం కాకుండా దేశంలోని అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా కృషి చేసిన అంబేద్కర్ జీవిత చరిత్ర నేటి తరానికి ఎంతో మార్గదర్శకంగా ఉంటుందన్నారు. ఆయన చూపిన బాటలో నడిచి ఆశయాలను కొనసాగించడమే మనం ఆయనకు ఇచ్చే గౌరవం అన్నారు. ఓటు హక్కును కల్పించిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని అన్నారు. ఎస్సీ, ఎస్టీ లతోపాటు బీసీ రిజర్వేషన్ కూడా వచ్చేంతవరకు పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు జ్యోతి కరుణాకర్, భైరబోయిన శ్రీనివాస్, నిమ్మల వెంకన్న, రాష్ట్ర మైనార్టీ నాయకులు సాజిదు, రిటైర్డ్ ఎస్సై అబ్దుల్లా, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలి

❖ రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**దశ, రాజేంద్రనగర్:** అయ్యప్ప స్వామి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్దేవుపల్లి డివిజన్లోని దుర్గా కన్వెన్షన్ లో శనివారం ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ పడిపూజ కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొని అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అయ్యప్ప మాల ధారణ అనేది ఎంతో పవిత్రమైనదని 41 రోజులపాటు కఠినంగా ఒంటి పూట భోజనం చేసి ఎంతో నిష్టతో చలిని సైతం లెక్కచేయకుండా అయ్యప్ప స్వాములు పూజలు నిర్వహిస్తూ ఉంటారన్నారు. అయ్యప్ప మాల ధారణ వేసుకోవడం అనేది ఎంతో అదృష్టం అన్నారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండి సుఖసంతోషాలతో అష్టైశ్వర్యాలతో ప్రతి ఒక్కరూ ఉండే విధంగా అయ్యప్ప స్వామి అనుగ్రహం ప్రతి ఒక్కరిపై ఉండే విధంగా స్వామి వారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైలార్దేవుపల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ ప్రేమ్ దాస్ గౌడ్, స్థానిక నాయకులు, అయ్యప్ప స్వాములు తదితరులు పాల్గొన్నారు.

# దశ

నిజం.. నిర్భయంగా..

03
ఆదివారం
7-12-2025


WWW.
DASHANEWS
.COM


## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కు ఘనమైన నివాళి




**దశ, ఇబ్రహీంపట్నం:** మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్టాఫ్ క్లబ్, జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్. రాధిక, అధ్యాపకులు ఘనంగా నివాళి అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్. రాధిక మాట్లాడుతూ.. భారతదేశ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కృషిని కొనియాడారు. అన్ని వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన మహనీయుడిగా, దీనజనుల కల్పతరువుగా బాబా సాహెబ్ చేసిన పోరాటం అసమానమని కొనియాడారు. పేదరికంలో పుట్టి ఎన్నో ఉన్నత డిగ్రీలను సాధించి, అపారమైన విజ్ఞానాన్ని సంపాదించుకొని తన రచనల ద్వారా అంబేద్కర్ నేటి విద్యార్థులకు ఆదర్శం కావాలని, విద్యార్థులందరూ ఆయనను స్ఫూర్తిగా తీసుకుని చదువులలో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె. సురేశ్, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారులు డా. రమేశ్, డా. చింతల రాకేశ్ భవాని, డాక్టర్ రచన అధ్యాపకులు డివి రావు డిఎస్ఎస్ఆర్ కృష్ణ, సురేశ్, హృదయ రాజు, డా. నర్సింగరావు డా. సురేఖ, డా. నీలిమ, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## 65 రోజులకు చేరిన ఓయూ అధ్యాపకుల నిరసనలు



**దశ, ఓయూ:** ప్రమోషన్స్లో తమకు అన్యాయం జరిగిందంటూ ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకులు చేస్తున్న నిరసన కార్యక్రమాలు 65 రోజులకు చేరాయి. శనివారం ఓయూ లా కాలేజీలో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా విగ్రహం నివాళ్లు అర్పించి తమకు న్యాయం చేయాలనీ వేడుకున్నారు. అనంతరం కొంత సేపు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఔటా అధ్యక్షులు ప్రొ మనోహర్ మాట్లాడుతూ సిఏఎస్ ప్రమోషన్స్లో 47 మంది అధ్యాపకులకు ప్రమోషన్స్ ఇవ్వకుండా రిజెక్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. యూజిసి నిబంధనలకు విరుద్ధంగా ఓయూ అధికారులు వ్యవహరిస్తున్నారనీ మండిపడ్డారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్రెడ్డి ఈ నెల 10న ఓయూ పర్యటనకు వస్తున్న సందర్భంగా అధ్యాపకులకు జరిగిన అన్యాయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు గంగాధర్, శ్రీనివాస్లు, వెంకటేశ్వర్లు, రమేష్ తదితరులున్నారు.

## చాకిరాల సర్పంచ్ అభ్యర్థిగా చిర్ర రమ్య ఏకగ్రీవ ఎన్నిక



**దశ, నడిగూడెం :** చాకిరాల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చిర్రా రమ్య ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే ఉత్తమ పద్మావతి రెడ్డి ని కలిసి తమకు పార్టీ అభ్యర్థిగా సీటు ఇచ్చి తన గెలుపు కారణమైన పద్మావతి రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేశారు. తదనంతరం ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి నూతనంగా ఎన్నికైన సర్పంచ్ చిర్రా రమ్యను అభినందించారు. బాధ్యతలు చేపట్టి ఏకగ్రీవం కావడానికి కృషి చేసిన ఎంపీపీ యాతాకుల జ్యోతి మధుబాబును స్థానిక శాసనసభ్యులు ప్రత్యేకంగా అభినందించారు.

## డా.బీ.ఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు:ఏబీవీపీ



**దశ, ఓయూ:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఉస్మానియా యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో 69వ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు ఈ సందర్భంగా యూనివర్సిటీ అధ్యక్ష,కార్యదర్శులు దృహన్ మరియు శివశంకర్ మాట్లాడుతూ అంబేద్కర్ ని గుర్తుచేసుకుంటూ వారి త్యాగాన్ని కొనియాడారు.అంబేద్కర్ ని కొన్ని కులాలకు వర్గాలు మాత్రమే పరిమితం చేస్తున్నారు వారు అన్ని వర్గాల ప్రజలకోసం పాటుపడ్డారు కానీ కొందరు రాజకీయ లబ్ధి కోసం పాకులాడుతూ ఇలా చేయడం సిగ్గుచేటని అన్నారు.కావున విద్యార్థులు ప్రజలు అంబేద్కర్ ని ఆదరించి వారి ఆశయాలను ముందుకు తీసుకుపోయే ప్రయత్నం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శేఖర్, యూనివర్సిటీ నాయకులు కోటి,నరేందర్, మహేష్,వెంకటేష్,మోక్షిత్, సాయితేజ,తన్మయి,విజయ్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప గంట స్వామి మహాపడి పూజ



**దశ, ఇబ్రహీంపట్నం:** మండల కేంద్రంలోని బృందావన్ కాలనీ లో నాగన్ పల్లి గ్రామానికి చెందిన దోర్నాకుల శ్రీకాంత్ గంటస్వామి మహాపడి పూజ ను ఘనంగా నిర్వహించారు. ఈదులకంటి గోపాల కృష్ణ గురుస్వామి, పెద్దరావుల జంగయ్య గురుస్వామి కరకమలములచే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వామి గోపాల కృష్ణ మాట్లాడుతూ.. మండల కాలం పాటు అయ్యప్ప మాలదారులు ఎంతో భక్తి శ్రద్ధలతో, నిష్ఠ నియమాలను పాటిస్తూ.. అనునిత్యం అయ్యప్ప నామస్మరణ వేడుకుంటారని పేర్కొన్నారు. ఈ మహాపడి పూజ కార్యక్రమంలో సన్నిధానం గురుస్వాములు కసరమోని పాండు, బాలం పవన్ కుమార్, రాయపోల్, నాగన్ పల్లి స్వాములు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగం ప్రపంచానికి ఆదర్శం

- ❖ అంబేద్కర్ స్ఫూర్తిని కొనసాగిద్దాం.
- ❖ వర్ధంతి వేడుకల్లో ఏఐసిసి సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి
- ❖ రెబల్ శ్రీను ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలు



**దశ, సూర్యాపేట:** భారత దేశ రాజ్యాంగ నిర్మాణం కోసం కృషి చేసిన డా.బీఆర్ అంబేద్కర్ ఆశయాలను ప్రతిఒక్కరూ నెరవేర్చే దిశగా పయనించాలని ఏఐసిసి సభ్యుడు రాంరెడ్డి సర్వోతం రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేనారెడ్డి అన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ పట్టణ ఎస్సి సెల్, ఐఎన్ టియుసి పట్టణ అధ్యక్షుడు వల్దాసు శ్రీను అధ్వర్యంలో డా.బీఆర్ అంబేద్కర్ వర్ధంతి పురస్కరించుకుని ఖమ్మం రోడ్డు సమీపంలోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ చిన్న కుటుంబంలో పుట్టిన స్వశక్తిగా ఎదిగి ప్రపంచ నాయకునిగా ఏదిగారు. బావితరాలకు మార్గదర్శిగా నిలిచారు. భారతదేశానికి రాజ్యాంగానికి అందించిన మహోన్నత వ్యక్తి, అత్యంత మేధా సంపత్తి కలిగిన గొప్ప దార్శనికుడు డా.అంబేద్కర్ అని అన్నారు. వారి జీవితం మొత్తం దేశానికి, అణగారిన పేద బడుగు బలహీన వర్గాల కోసం త్యాగం చేసిన మహనీయుడు అని కొనియాడారు. రాజ్యాంగ పితామహుడు, ప్రపంచ మేధావి అంబేద్కర్ బాటలో ప్రజలు పయనించాలని అన్నారు. కుల, మతాలకతీతంగా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా జీవించాలని సూచించారు.కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు నింపి అక్షరాన్ని ఆయుధంగా మలిచి జ్ఞానాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు అంబేద్కర్ అని అన్నారు. సమాజంలోని నిమ్నజాతి వర్గాలకు రాజ్యాధికారాన్ని చేరువ చేసే దిశగా వైపు అంబేద్కర్ రాజ్యాంగ రచన చేసినట్లు వివరించారు. అంబేద్కర్ కృషి వల్లే నేడు అణగారిన వర్గాలు ఆత్మ గౌరవంతో జీవిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్, పట్టణ అధ్యక్షులు అంజద్ అలీ, పిడమర్తి నాగరాజు, బొజ్జ సంజయ్, పిడమర్తి ఉపేందర్, చింతమల్ల రమేష్, కుమ్మరికుంట్ల వేణు,నాగుల వాసు, రుద్రంగి రవి, చింత వెంకన్న, పందిరి మల్లేష్, సాజిత్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డిపేటలో ఘనంగా అంబేద్కర్ వర్ధంతి వేడుకలు



**దశ ఎల్లారెడ్డిపేట:** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల వ్యాప్తంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాలను స్థానిక అంబేద్కర్ సంఘాలు కాంగ్రెస్,బిఆర్ఎస్, బిజెపి, దళిత సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు,దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ లేనిదే రాజ్యాంగం లేదని, అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, ఏఎంసి వైస్ ప్రెసిడెంట్ గుండాడి రాంరెడ్డి , జిల్లా కాంగ్రెస్ నాయకులు అధ్యక్షులు కోమ్మిరి శెట్టి తిరుపతి, సీనియర్ జర్నలిస్ట్ బండారి బాల్రెడ్డి, ఎస్సీ రిజర్వ్ స్థానం నుండి సర్పంచ్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న ఎడ్ల రాజకుమార్ , చెన్ని బాబు గడ్డం జితేందర్, వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న అంతేర్పుల గోపాల్, పందిళ్ళ శ్రీనివాస్ గౌడ్, మేండే శ్రీనివాస్ యాదవ్, పిట్ల రాజు, రోడ్డ సతీష్, మేడి నర్సింలు, లింగాల రామచందర్, మేడి సుదర్శన్, వివిధ పార్టీల నాయకులు, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలందరూ నిర్భయంగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

❖ కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్




**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** ప్రజలందరూ నిర్భయంగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్ అన్నారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు చుంచుపల్లి రామాలయం నుండి బైపాస్ రోడ్డు వరకు కొత్తగూడెం సబ్ డివిజన్ ఆధ్వర్యంలో శనివారం ఫ్లాగ్ మార్చ్ ను నిర్వహించారు. పంచాయితీ ఎన్నికల సందర్భంగా జరగనున్న పోలింగ్ నకు ప్రజలంతా హాజరై తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేందుకు సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను చేసినట్లు డిఎస్పీ రెహమాన్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా అన్ని విధాల చర్యలు చేపడుతున్నామని అన్నారు. ప్రజలలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకే పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ లను నిర్వహించడం జరుగుతుందన్నారు. మద్యం నగదు ఇతర వస్తువుల ద్వారా ఎవరైనా ఓటర్లను ప్రలోభపెడుతున్నట్లు తమ దృష్టికి వస్తే ఎన్నికల నియమావళి ప్రకారం వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఎవరైనా ప్రవరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కొత్తగూడెం సబ్ డివిజన్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయాల సాధనకై అందరు కృషి చేయాలి

❖ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** భారతరత్న అంబేద్కర్ ఆశయాల సాధనకై అందరూ కృషి చేయాలని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక అంబేద్కర్ సెంటర్ (హెడ్ పోస్ట్ ఆఫీస్) వద్దగల అంబేద్కర్ విగ్రహానికి భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం దళిత బహుజన సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం పలువురు పూలమాలలు వేసిన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కూనంనేని ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అంబేద్కర్ అడుగుజాడలో ప్రతి ఒక్కరు ముందుకు సాగాలన్నారు. అనంతరం దళిత సంఘాల ప్రముఖ నాయకులు ఆచార్య డాక్టర్ శివకుమార్, కూసపాటి శ్రీనివాస్, తాండ్ర వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ సమాజానికి అంబేద్కర్ ఇజం ఒక్కటే మార్గదర్శకమని బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవి అమలు జరిగేటట్టుగా ప్రభుత్వాన్ని ముందుకు నడిపించాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకలలో శాసనసభ్యులు కూనంనేని, ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్, కూసపాటి శ్రీనివాస్, తాండ్ర వెంకటేశ్వర్లు, పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్లు కరుణాకర్, చెన్నూరి శ్రీనివాస్, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ గడ్డిపల్లి కవిత, భద్రాద్రి కొత్తగూడెం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, జిల్లా కాంగ్రెస్ పార్టీ యువజన సంఘం అధ్యక్షులు చీకటి కార్తీక్, కుంజా కవిత లతోపాటు దళిత సంఘాల ప్రముఖ నాయకులు జెబి శౌరి, ఎర్రా కామేష్, సింగరేణి రిటైర్డ్ జిఎం అందెల ఆనందరావు, మంద హనుమంతు, చింతలచెరువు గిరీశం, మల్లెల రామనాథం, గుండా రమేష్, మారపాక రమేష్, కోట శివశంకర్, బొంకూరి పరమేష్, కోదాడ శ్రీనివాస్, విశారదన్ అనుచరుడు సంజీవ్, అల్లిశంకర్, పి.సురేందర్, తమ్మల్ల రవి, జోసెఫ్, దంసలపూడి భాస్కర్, చదలవాడ సూరి, అంకినీడు ప్రసాద్, మద్దెల సుధీర్, కేదాసి పీటర్ బాబు, అశ్వ, దళిత మహిళా సంఘాల నాయకురాళ్ళు బడికల పుష్పలత, జోగు రమాదేవి, కుంచె లావణ్య, స్వర్ణలత, మాట్ల గాయత్రి, మందా చంద్రకళ, రాజేశ్వరరావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


## సాయి ఈశ్వర చారి కుటుంబానికి ప్రభుత్వం రూ 50 లక్షలు "ఎక్స్‌గ్రేషియా" ప్రకటించాలి

- ❖ బిసి డిక్లరేషన్ ను తుంగలో తొక్కిన ప్రభుత్వం
- ❖ బిఆర్ఎస్ నాయకులు కంచర్ల రవి గౌడ్ డిమాండ్




**దశ, రాజన్న సిరిసిల్ల జిల్లా :** రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం అన్యాయం చేస్తుందని బిఆర్ఎస్ నాయకులు కంచర్ల రవి గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ బిడ్డ సాయి ఈశ్వర చారి ఆత్మహత్యకు ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల పేరిట ప్రభుత్వం వర్గాలను మోసపూరితంగా నమ్మబలికిందని, ఆ అన్యాయానికి నిరసనగా సాయి ఈశ్వర చారి ఆత్మహత్యకు పాల్పడ్డాడని రవి గౌడ్ తెలిపారు.కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన హామీలు మాయమాటలేనని, అవి ప్రభుత్వ అసలు వైఖరికి నిదర్శనమని విమర్శించారు.రాష్ట్రంలో ఉన్న బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ ఘటనపై నోరు విప్పకపోవడం దురదృష్టకరమని, బీసీలకు ఎన్నికల ముందు 42% రిజర్వేషన్ ఇస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక కేవలం 17%కి కుదించడంతో బీసీ వర్గాలకు వెన్నుపోటు పొడిచారని తీవ్రంగా మండిపడ్డారు.సాయి ఈశ్వర చారి ఆత్మహత్యపై పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశం,రాష్ట్రానికి సమాధానం చెప్పాల్సిందేనని రవి గౌడ్ డిమాండ్ చేశారు. బీసీ బిడ్డ ఆత్మబలిదానానికి కారణమైన ఈ ప్రభుత్వాన్ని బీసీ సమాజం ఎప్పటికీ క్షమించబోదని హెచ్చరించారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో బీసీ వర్గాలు అభివృద్ధి పథంలో ప్రయాణించగా, ప్రస్తుత ప్రభుత్వం బీసీలను పూర్తిగా విస్మరించి, కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను తుంగలో తొక్కింది," అని ఆయన అన్నారు.సాయి ఈశ్వర చారి కుటుంబానికి కనీసం రూ.50లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించి,కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రవి గౌడ్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు,వడ్లూరి వేణు,అరెల్లి వినయ్, ద్యావనాపెల్లి సందీప్, అలుగునురి వినాయక్, శ్రీకాంత్, శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

# మహనీయునికి ఘన నివాళులు



**దశ, రాజన్న సిరిసిల్ల జిల్లా:** భారతరత్న డా.బి.ఆర్.అంబేద్కర్ 69 వ వర్ధంతి సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకులు మిద్దె ప్రకాష్, టి,ఎన్,ఎస్,ఎఫ్ కరీంనగర్ పార్లమెంట్ అధ్యక్షులు, టీడీపీ వేములవాడ అడహక్ కమిటీ సభ్యులు మోతె రాజిరెడ్డి లు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మోతె రాజిరెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత,సామాజిక సమానత్వానికి, అణగారిన వర్గాల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన భారతరత్న డా.భీమ్‌రావ్ రామ్‌జీ అంబేద్కర్ ని మనం స్మరించుకుంటూ ఘన నివాళి అర్పిస్తున్నామన్నారు.డా. అంబేద్కర్ కేవలం ఒక వ్యక్తి కాదు,ఆయన ఒక యుగకర్త, జ్ఞానజ్యోతి,సమానత్వ సిద్ధాంతానికి ప్రతీకన్నారు. రాజ్యాంగ నిర్మాతగా ఆయన అందించిన రాజ్యాంగం మన దేశానికి ఆత్మ,ప్రతి పౌరుడికి స్వేచ్ఛ, సమానత్వం,సౌభ్రాతృత్వాన్ని, న్యాయాన్ని అందించిన మహనీయుడని అన్నారు. సామాజిక విప్లవకారుడిగా అంటరానితనం, కులవివక్ష అనే చీకట్లను పారద్రోలి, కోట్లాది మంది అణగారిన ప్రజల జీవితాల్లో వెలుగు నింపిన ఆశాదీపమన్నారు. న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా ఆయన మేధస్సు,ఆలోచనలు నేటికీ ఎంతోమందికి మార్గదర్శకాలుగా నిలుస్తున్నాయని తెలిపారు.ఆయన చూపిన మార్గంలో పయనించడమే మనం ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు. సమాజంలో సమానత్వం,న్యాయం, విద్య అందరికీ అందేలా కృషి చేయాలని,ఆయన ఆశయాలను మనసా,వాచా,కర్మణా ముందుకు తీసుకెళ్లాలని ఈ సందర్భంగా ప్రతిన పూనుకుందామన్నారు.



## ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

**దశ, ఇబ్రహీంపట్నం:** ప్రపంచ వికలాంగుల దినోత్సవం పురస్కరించుకొని ఇబ్రహీంపట్నం భవిత కేంద్రంలో మండల విద్యాధికారి హీర్య నాయక్ అధ్యక్షతన ప్రపంచ వికలాంగుల దినోత్సవాని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా అదనపు న్యాయమూర్తి జి ప్రవీణ్ కుమార్ హాజరై మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో పాల్గొనడం నేను అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు. ఈ దివ్యాంగ పిల్లలకు సంబంధించి 2016 చట్ట ప్రకారం లీగల్ సెల్ కూడా సపోర్ట్ చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ అందిస్తున్న దివ్యాంగులకు సంబంధించిన పథకాలను వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ దివ్యాంగులు భగవంతునితో సమానమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంకల్ప ఎన్జీవో వ్యవస్థాపకురాలు రోజి మాట్లాడుతూ..ఇలాంటి పిల్లలు ఉన్న కుటుంబాలు లక్ష్మీదేవితో సమానమని తెలిపారు. అనధికారికంగా మా ఎన్జీవో తరపున భవిత కేంద్రానికి ఎటువంటి సహాయం అయినా చేయడానికి ముందుంటామని తెలిపారు. ప్రభుత్వము దివ్యాంగుల కోసము పెద్ద మొత్తంలో నిధులు కేటాయించి వారి అభివృద్ధికి తోడ్పడుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించారు. అందులో గెలిచినటువంటి వారికి బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటమ్మ, మండల పిఆర్టియు అధ్యక్షులు డాక్టర్ పరకాల పరమేష్, సీనియర్ న్యాయవాది ముద్దం వెంకటేశం యాదవ్, ప్రత్యేక ఉపాధ్యాయులు ఐ ఈ ఆర్ పి రమేష్, దీప్తి, ఎం ఆర్ సి సిబ్బంది శేషు, సంపత్, అశోక్, అమీనా, భవిత కేంద్ర ఆయా యూసుఫ్, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.